క్లుప్తంగా

సెలవులో గజ్వేల్‌-ప్రజ్ఞాపూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌

గజ్వేల్‌: గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌ విద్యాధర్‌ సెలవులో వెళ్లారు. గ్రూపు–1 పరీక్షల ప్రిపరేషన్‌ కోసం నాలుగు నెలలపాటు సెలవు కోరగా పది రోజుల క్రితమే మున్సిపల్‌ శాఖ ఉన్నతాధికారులు మంజూరు చేశారని కమిషనర్‌ తెలిపారు. కాగా ఆయన స్థానంలో ఇదే కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణకు ఇన్‌చార్జ్‌ బాధ్యతలు అప్పగించారు. అవిశ్వాస రాజకీయాలు నడుస్తున్న వేళ కమిషనర్‌ దీర్ఘకాలిక సెలవు చర్చనీయాంశంగా మారింది.

బీసీ కులగణన చేపట్టాలి



బెజ్జంకిలో సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో వెంటనే బీసీ కులగణన చేపట్టడంతో పాటు బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం బెజ్జంకిలో ఆపార్టీ నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిశాని రామచంద్రం మాట్లాడుతూ.. బీసీలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరిణి అవలంబిస్తుందని ఆరోపించారు. 3లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం 6వేల కోట్లు మాత్రమే కేటాయించి అన్యాయం చేశారన్నారు. దళితులకు పంపిణీ చేసిన భూములు 300 ఎకరాలు కూడా ఉండవని, దానికి బడ్జెట్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ తప్పుడు లెక్కలను వివరించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బొనగిరి ప్రభాకర్‌, ప్రధాన కార్యదర్శి నిశాని రాజమల్లు, మాతంగి తిరుపతి, లింగాల శ్రీనివాస్‌, రామచంద్రం, నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ సామగ్రి అందజేత



పంచాయతీ కార్యాలయంలో వస్తువులను అందిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): కంటి వెలుగును అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ధర్మారం, చిన్నకిష్టాపూర్‌ గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారంతా కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ స్టీల్‌ వస్తువులను సర్పంచ్‌ రాజు అందించగా ప్రతాప్‌రెడ్డి రాజును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కనకయ్య, రాజు, పీఏసీఎస్‌ చైర్మన్‌ ఇంద్రసేనారెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్‌, ఉపసర్పంచ్‌ రాజిరెడ్డి, కొండపోచమ్మ డైరెక్టర్‌ లక్ష్మణ్‌రాజ్‌, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ భూమయ్య పాల్గొన్నారు.

విద్యుత్‌ కోతలతో రైతులు ఆగం

డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంట్‌ ఇస్తున్నామని చెప్పి రైతులను మోసం చేస్తుందని, అప్రకటిత కరెంట్‌ కోతలతో రైతులు వేసిన యాసంగి పంటలు ఆగమవుతున్నాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు విమర్శించారు. కరెంట్‌ కోతలను నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి కరెంట్‌ లేక ఎండిపోతున్నాయన్నారు. ఎప్పుడు కరంట్‌ ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కరెంట్‌ కోసం రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్‌ సరఫరా చేయాలని, లేదంటే రైతుల పక్షాన ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌, జయంత్‌, నాగరాజు, రాజు, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే ఆరోపణలు

బెజ్జంకి(సిద్దిపేట): గడప గడపకూ కాంగ్రెస్‌ కార్యక్రమానికి మండలంలో వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్‌ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి అన్నారు. బెజ్జంకిలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులను గుప్పిట్లో ఉంచుకొని అక్రమాలకు పాల్పడుతున్నదెవరో, సొంత పార్టీపై విమర్శలు చేసిన నాయకులెవరో అందరికి తెలుసన్నారు. లక్షల సంపాదనను వదులుకొని ప్రజాసేవ చేస్తున్న నాయకుడు కవ్వంపెల్లి సత్యనారాయణను విమర్శించడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు రాములు, ప్రవీణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మద్దూరు మండల సభలో ఎంపీపీ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్‌): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం సజావుగా సాగింది. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. ముందుగా వివిధ శాఖ పనితీరుపై సమావేశంలో మాట్లాడారు. ఈ సంవత్సరం 7వేల ఎకరాల్లో వరిసాగు పెరిగిందని ఏవో రామకృష్ణ సభ దృషికి తీసుకొచ్చారు. దీంతో లద్నూరు ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య ఎప్పుడు లేని విధంగా వరిలో మొగి పురుగు దాడితో వరి పంట 50శాతానికిపైగా నాశనమైందని వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామాల్లో ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించలేదన్నారు. స్పందించిన ఏవో రెండు రోజుల్లో గ్రామాల్లో వరి పంట సాగుపై ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే దూల్మిట్ట బెక్కల్‌ గ్రామంలో రాత్రిలు విపరీతంగా అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని ఎవరూ పట్టించుకోవడం లేదని బెక్కల్‌ సర్పంచ్‌ కూకట్ల బాల్‌రాజు వాపోయాడు. స్పందించిన తహసీల్దార్‌ గోపాల్‌ ఇసుక అక్రమ రవాణాపై సమాచారం ఇస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మద్దూరు మండల కేంద్రంలో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ లేకపోవడంతో కూలీలకు పనిపై సమాచారం లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఫీల్డ్‌ అసిస్టెంట్‌ను నియమించాలని సర్పంచ్‌ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి కోరారు. పశువుల పాక నిర్మించుకొని రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లు చెల్లించలేదని రేబర్తి ఎంపీటీసీ కూరెళ్ల రాజు అధికారులపై మండిపడ్డారు. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లు విడుదల చేయలేదని అధికారులపై సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటి బిల్లు వసూల్‌ చేస్తున్న విద్యుత్‌ అధికారులు విద్యుత్‌ సమస్యలను పట్టించుకోవడం లేదని అధికారులపై సర్పంచ్‌లు మండిపడ్డారు. రెండు సంవత్సరాల నుంచి విద్యార్థులకు రావాల్సిన రవాణా సౌకర్యాల బిల్లు రావడం లేదని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎంఈవో కరోనాతో డబ్బులు రాలేదని, ఈ సంవత్సరం నుంచి డబ్బులు వస్తాయన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఎక్సైజ్‌ అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రజాప్రతినిధులు వాపోయారు. లక్కపల్లి, ధర్మారం రోడ్డును ఎప్పుడు నిర్మిస్తారని ధర్మారం సర్పంచ్‌ పీఆర్‌ఏఈని అడగగా ప్రపోజల్‌ పంపించామన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పాలకవర్గం



మంత్రికి మొక్క అందజేస్తున్న పాలకవర్గం

సిద్దిపేటజోన్‌: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్‌రావును సోమవారం సంతోషీమాత దేవస్థానం పాలకవర్గం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది. శాసనసభలో బడ్జెట్‌ సమావేశాలు విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో వారు మంత్రిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్‌ నవీన్‌, సభ్యులు సత్యం, సంతోష్‌, ప్రభాకర్‌, మాధురి, కల్యాణి ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చిట్యాల గ్రామ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బోధనలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాంకిషన్‌, నవిత, నర్సింహులు, సత్యనారాయణ, శ్రీనివాస్‌, బాలకృష్ణ, శారద, ప్రశాంత్‌కుమార్‌, జ్యోతి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ఉపకార వేతనం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్‌ గ్రామానికి చెందిన తడకపెల్లి శ్రవణ్‌ 2021–22 సంవత్సరంలో ఇండస్ట్రియల్‌ సేఫ్టీ కోర్సులో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జే అండ్‌ ఏ భారత్‌ హెచ్‌ఎస్‌ఈ ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు అయేషా శ్రవణ్‌ను హైదరాబాద్‌లోని కార్యాలయంలో సోమవారం అభినందించి ప్రశంస పత్రంతో పాటు 20 వేల రూపాయలను ఉపకార వేతనంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రమణ, అజీంలు పాల్గొన్నారు.

మహిళల్లో ఆలోచన శక్తి పెరగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌, పోలీస్‌ కమిషనర్‌

సిద్దిపేటజోన్‌: సమాజాన్ని మార్చే శక్తి మహిళలకు ఉందని, మహిళల ఆలోచన శక్తి మరింత పెరుగాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ, పోలీస్‌ కమిషనర్‌ శ్వేత పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉద్యోగి, ఉపాధ్యాయిని తరుణి మహిళా అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు వారు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాసనాలు, ఏకపాత్రాభినయన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల, జిల్లా మహిళా అధికారులు సరోజ, అమినా, దేవకీదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్‌): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్‌ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రజలు నాయకులకు ఓట్లు వేసి గెలిపించింది వారికి సేవ చేయడానికే అని అన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలు తెలుసుకొని వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. తద్వార మళ్లీ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉంటుదన్నారు. అదానీ దేశం నుంచి దోచుకున్న 11లక్షల కోట్ల రూపాయలను దేశంలో రాష్ట్రాలకు పంచితే దేశం గొప్పస్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. దీనిపై పార్లమెంట్‌లో బీజేపీ నాయకులను ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వకపోవడంపై ఆయన మండిపడ్డారు. బీజేపీ రాష్ట్రంలో అధికారం కోసం పోరాడడం తప్పా అభివృద్ధిని మరిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణారెడ్డి, వైస్‌ ఎంపీపీ మల్లిపెద్ది సుమలతమల్లేశం, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్‌, యాదగిరి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

హుస్నాబాద్‌ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌

హుస్నాబాద్‌రూరల్‌: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేయించాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ అధికారులను ఆదేశించారు. సోమవారం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడంతో పాటు ఈఓ విశ్వనాథశర్మను ఇక్కడి నుంచి బదిలీ చేస్తే అలయ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ మాట్లాడుతూ.. ఈఓ సమయం వచ్చినప్పుడు బదిలీ అవుతారని అప్పటివరకు మన ఊరు ఆలయాన్ని అభివృద్ధి చేసుకునే బాధ్యత మనపై ఉందన్నారు. శివరాత్రి ఉత్సవాలకు వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉందని వారి కోసం ఆర్టీసీ మండల కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సు సర్వీస్‌లను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆలయం ఎదుట సీసీరోడ్ల నిర్మాణానికి రూ.40లక్షల వరకు మంజూరు చేస్తానని ఆ పనులను జెడ్పీ వైస్‌ చైర్మన్‌ రాజిరెడ్డి దగ్గరుండి చూస్తారన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ రాజిరెడ్డి, సర్పంచ్‌ దేవసాని సుశీల, సీఐ ఎర్రల కిరణ్‌, తదితరులు పాల్గొన్నారు.

అదానీ కుంభకోణంపై విచారణ జరిపించాలి

చేర్యాల(సిద్దిపేట): అదానీ కుంభకోణంపై జాయింట్‌ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్‌ డిమాండ్‌ చేశాడు. సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పట్టణ కేంద్రంలోని అంగడిబజార్‌ ఎస్‌బీఐ బ్రాంచీ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడీబీ చీఫ్‌ మేనేజర్‌ రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అశోక్‌ మాట్లాడుతూ.. దేశ కుబేరుల్లో ఒక్కడైన అదానీ కుంభకోణంపై జాయింట్‌ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపి, డబ్బు తిరిగి చెల్లించేలా చేసి ఆ డబ్బు పేదలకు పంచాలన్నారు. అలాగే బ్యాంకుల్లో అప్పులు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రధాని మోదీకి దేశ ప్రజల మీద చిత్తశుద్ధి ఉంటే అదాని కుంభకోణంపై పార్లమెంటరీ జాయింట్‌ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, సిద్ధయ్య, సుదర్శన్‌, మమత, అయిలయ్య, సీతారామయ్య, నర్సయ్య, బాల్‌రాజు పాల్గొన్నారు.

దుబ్బాక నియోజకవర్గంపై కక్ష సాధింపు చర్యలు

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



ఐఓసీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్‌: రెండేళ్లుగా దుబ్బాక అభివృద్ధికి ఎస్‌డీఎఫ్‌ నిధులు మంజూరు చేయాలని కోరినా, ప్రతిపక్ష ఎమ్మెల్యే కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే రఘునందన్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వారం రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించానన్నారు. సోమవారం దుబ్బాక పట్టణంలో రూ.17కోట్లతో ఐదేళ్లుగా కొనసాగుతున్న సమీకృత కార్యాలయం(ఐఓసీ) భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఉగాది వరకు భవనం కింది అంతస్తును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌డీఎఫ్‌ నిధులకు సంబంధించి తాను వేసిన రిట్‌ను న్యాయమూర్తులు అనుమతించారని, 4 వారాల్లోగా ఆర్థిక, పరిపాలన, శాసనసభ వ్యవహారాల సంబంధిత విభాగం అధికారులు కౌంటర్‌ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. దుబ్బాకలో ఐఓసీ భవన నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పనులు ఎక్కడిక్కడే ఆగాయని తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి పనులు తిరిగి ప్రారంభమై పనుల్లో వేగం పెరిగిందన్నారు. ఈ సంవత్సరంలో ఐఓసీ భవనాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. భవన నిర్మాణానికి ఇంకా రూ.5కోట్లను మంజూరు చేయాలని శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వానికి విన్నవించామన్నారు. దుబ్బాక ఔటర్‌ రింగ్‌ రోడ్‌ మాస్టర్‌ ప్లాన్‌ రూపకల్పన, పట్టణ అభివృద్ధికి అవసరమయ్యే నిధులకు సంబంధించి మంత్రులతో చర్చించామన్నారు. త్వరలోనే దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్‌ కేంద్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతులు మీదుగా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్‌గౌడ్‌, నాయకులు వెంకట్‌గౌడ్‌, ప్రవీణ్‌, భిక్షపతి, నేహల్‌గౌడ్‌ తదితరులున్నారు.

టీవైఆర్‌ లైబ్రరీలో కోచింగ్‌ సెంటర్‌



గజ్వేల్‌లో కరప్రతాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్‌: టీవైఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న లైబ్రరీలో అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన ఫౌండేషన్‌ కోర్సు కోచింగ్‌ సెంటర్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆ ఫౌండేషన్‌ చైర్మన్‌ టీ.రాజు తెలిపారు. విశ్వజన కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టార్జీ, తెలంగాణ జేఏసీ చైర్మన్‌ కోల జనార్దన్‌లతో కలిసి ఫౌండేషన్‌ కార్యకలాపాలపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీ.రాజు మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో వివిధ రంగాలకు సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు, దినపత్రికలు, వార పత్రికలు, కేరీర్‌ ఒరియెంటెడ్‌ పుస్తకాలు అందుబాటులో ఉంచి చదువుకునే ఏర్పాట్లు తమ గ్రంథాలయంలో ఉన్నాయని చెప్పారు. త్వరలో ప్రారంభించనున్న కోచింగ్‌ సెంటర్‌లో సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలకు చెందిన నిపుణులతో ఉపన్యాసాలు ఇప్పిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో చదువుకునేందుకు వీలుగా ప్రొజెక్టర్‌, టీవీలు కూడా ఈ లైబ్రరీలో అందుబాటులో ఉంచామన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిన నర్సింలు, ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాస్‌, రాములు, ముంద్రాతి కృష్ణ, యాదగిరి, సాయి, ఎంవీ శ్రీనివాస్‌, కృపానందం, ఎల్లం, ఓంప్రకాశ్‌, మోచి ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అవినీతిపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్‌: గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జ్‌ గంగాడి మోహన్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. బీజేపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ముత్రాజ్‌పల్లిలో శక్తి కేంద్ర ఇన్‌చార్జి నత్తి శివకుమార్‌ ఆధ్వర్యంలో ప్రజా గోస–బీజేపీ భరోసాలో భాగంగా కార్నర్‌ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతున్నామని చెబుతున్న ప్రభుత్వం మున్సిపాలిటీలో జరిగే అవినీతిపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ చేస్తున్న ఆగడాలను ప్రజలకు వివరించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనను ఎండగట్టాలన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ములుగు(గజ్వేల్‌): బూత్‌ కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ములుగు మండల బీజేపీ అధ్యక్షుడు రమేశ్‌యాదవ్‌ సూచించారు. మండలంలోని గంగాధర్‌పల్లిలో ఆదివారం రాత్రి బీజేపీ శక్తి కేంద్రం కార్నర్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, కేంద్రం అందించే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్‌ స్థాయి కార్యకర్తలు పని చేయాలన్నారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎల్లు రాంరెడ్డి, కిషాన్‌ మోర్చా జిల్లా కార్యదర్శి మన్నె శ్రీనివాస్‌, మండల ప్రధాన కార్యదర్శి యాదగిరి, బూత్‌ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ బాగయ్య పాల్గొన్నారు.

కంటి వెలుగుతో నిరుపేదలకు ప్రయోజనం



వెంకటాపూర్‌లో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఫైజా అహ్మద్‌

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంతో నిరుపేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ట్రైనీ కలెక్టర్‌ ఫైజా అహ్మద్‌ అన్నారు. వెంకటాపూర్‌లో జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తోందన్నారు. ఆపరేషన్‌ అవసం ఉన్నవారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయించడంతో పాటు ఉచితంగా అద్దాలు, మందులు అందజేస్తోందని చెప్పారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్‌, క్యాంప్‌ ఇన్‌చార్జి డాక్టర్‌ శివకేశవరెడ్డి, పీహెచ్‌ఎన్‌ హేమలత, సావిత్రి, స్వర్ణలత, సరస్వతి, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ సమాజ నివారణకు కృషి

కొండపాక(గజ్వేల్‌): అంధత్వ సమాజ నివారణ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలో 18 రోజుల కిందట ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమం సోమవారంతో ముగిసింది. కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన వైద్యులను, సిబ్బందిని శాలువాతో సన్మానించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మంచాల అనుసూయ, లక్ష్మి, ఉప సర్పంచ్‌ ఆరె భాస్కర్‌, ఎంపీడీఓ రాంరెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఈ నెల 16 నుంచి కేసీఆర్‌ క్రికెట్‌ కప్‌

గజ్వేల్‌రూరల్‌: సీఎం కేసీఆర్‌ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 16 నుంచి గజ్వేల్‌లో కేసీఆర్‌ కప్‌(తెలంగాణ రాష్ట్రస్థాయి గ్రేస్‌బాల్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌)ను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్‌ హరిశ్చంద్ర ప్రసాద్‌ తెలిపారు. సోమవారం విలేకరులతో అయన మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ. 50వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25వేల నగదు బహుమతిని అందిస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 15వ తేదీలోగా 7780596892 నంబరులో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

◆ ఆర్థికసాయం

మద్దూరు(హుస్నాబాద్‌): మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన మంద యాదయ్య కొద్ది సంవత్సరాల నుంచి అనారోగ్యానికి గురై బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి యాదయ్య కుతురు వివాహానికి రూ.15వేలు ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నాడు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

◆ సమాచారం లేకుండా విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): పట్టణంలోని ఆదర్శనగర్‌, మహాశక్తినగర్‌లలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా వివిధ ప్రైవేట్‌ పాఠశాలలతో పాటుగా, ప్రైవేట్‌ సంస్థల నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్‌ సరఫరా నిలిపివేయడం సరికాదని, విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటే ముందురోజే సమాచారం అందించాలని ఆయా కాలనీల ప్రజలు వాపోయారు.

◆ బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవు

సిద్దిపేటరూరల్‌: కంటి వెలుగు కార్యక్రమానికి హాజరు కాని వారి ఇంట్లోకి సంక్షేమ పథకాలు రాకుండా చేస్తామని చెప్పి బెదిరిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులపై చర్యలు తప్పవని బీజేపీ నాయకులు డిమాండ్‌ చేశారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న వ్యతిరేక చర్యలపై బీజేపీ మండల అధ్యక్షుడు మోత్కు బుగ్గరాజేశం, నాయకులు ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ నాయకులు బెదిరించిన సాక్షాలతో మండల కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తామన్నారు. అధికారం ఉందని అహంతో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే తగిన గుణపాఠం చెప్పే రోజులు ముందున్నాయన్నారు.

◆ అసత్య ప్రచారాలు బీజేపీకే సొంతం

సిద్దిపేటరూరల్‌: నారాయణరావుపేట మండల వ్యాప్తంగా జరుగుతున్న కంటివెలుగు కార్యక్రమంపై సోషల్‌ మీడియాలో అబద్ధపు ప్రచారాలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. సోమవారం నారాయణరావుపేటలో జరుగుతున్న కంటి వెలుగుపై ప్రచారం చేస్తున్న అబద్ధపు మాటలపై బీఆర్‌ఎస్‌ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలపై బురదజల్లుతూ ప్రతిరోజు తన ఉనికిని చాటుకోవడానికి చేస్తున్న చిల్లర పనులు తప్పా, ఇందులో నిజం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షాదారాలను దమ్ముంటే బయటపెట్టి ప్రజాక్షేత్రంలో చూపించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ సంతోష్‌కుమార్‌, ఎంపీటీసీ హరీశ్‌, సీనియర్‌ నాయకులు కుంబాల ఎల్లారెడ్డి, దండు ప్రభాకర్‌, దేవరాజు, ఆలయ చైర్మన్‌ పూసల కిషన్‌, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ వాలెంటైన్స్‌ డే బ్యాన్‌ వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ

సిద్దిపేటకమాన్‌: పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్‌ నాయకులు సోమవారం వాలెంటైన్స్‌ డే బ్యాన్‌ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా వాలెంటైన్స్‌ డే గ్రీటింగ్‌ కార్డులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 14న యువత ప్రేమికుల రోజు అంటూ విదేశీ సంస్కృతి దారిన నడుస్తున్నారని, అలాంటి విదేశీ సంస్కృతిని దేశం నుంచి తరిమికొట్టాలన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పుల్వామా దాడిలో వీరమరణం పొందిన వీర జవాన్లకు నివాళులర్పించాలన్నారు. కార్యక్రమంలో రాజారాం, శ్రీనివాస్‌, నాగేందర్‌, నరేశ్‌, శ్రీకాంత్‌, రాజు, దినేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ సరోజిని నాయుడు స్ఫూర్తితో ముందుకుసాగాలి

గజ్వేల్‌రూరల్‌: విద్యార్థినులు సరోజిని నాయుడు స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని గజ్వేల్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పీవీ ఉమాశశి అన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్‌ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సరోజిని నాయుడు 143వ జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఎన్‌ఎస్‌ఎస్‌(జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ సార్వాణి, ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆఫీసర్లు కస్తూరిబాయి, డాక్టర్‌ పి. జయరాజు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ ప్లాస్టిక్‌ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్లాస్టిక్‌ రహిత గ్రామంగా కొండాపూర్‌ను తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సర్పంచ్‌ పెద్ది కవితరాజు అన్నారు. మండల పరిధిలోని కొండాపూర్‌ గ్రామంలో ప్లాస్టిక్‌ వాడకంతో కలిగే అనర్థాలపై సోమవారం వార్డు సభ్యులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టీల్‌ వాడకంపై గ్రామస్తులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని కోరుతూ గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ అమర్‌, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవి, వార్డుసభ్యులు ప్రవళిక, పద్మ, అనిత, నర్సింహారెడ్డి, గుట్టయ్య, శంకరవ్వ, రాజు, రేణుక, కనకవ్వతో పాటు నాయకులు పెద్దిరాజు, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ అర్హులకు ‘డబుల్‌’ ఇళ్లు కేటాయించాలి

హుస్నాబాద్‌: డబుల్‌ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అనర్హులను తొలగించి అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ వైఎస్సార్‌టీపీ నాయకులు సోమవారం మున్సిపల్‌ కమిషనర్‌ రాజమల్లయ్యకు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు విడుదల చేసిన జాబితాలో అవకతవకలు జరిగాయని, ఇళ్లు ఉన్న వారికి కేటాయించి పేదలకు అన్యాయం చేశారన్నారు. జిల్లా అధికారులు రెండు సార్లు సర్వే చేసిన జాబితాలో ఎలాంటి మార్పు లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో నిరుపేదలకు నష్టం జరుగుతుందన్నారు. జాబితాను రద్దు చేసి అర్హులకు ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమేశ్‌, నాయకులు ఉన్నారు.

◆ వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌ అందించాలి

చేర్యాల(సిద్దిపేట): వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌ సరఫరా అందించాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి డిమాండ్‌ చేశాడు. సోమవారం విద్యుత్‌ శాఖ కార్యాలయంలో ఏఈ తిరుపతికి తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి అందించే విద్యుత్‌ సరఫరా సమయాన్ని తగ్గించడం కారణంగా రైతులు వేసిన వరిపంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, చంద్రం, నరేశ్‌, ఎల్లయ్య, రాములు పాల్గొన్నారు.